సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

కలెక్టర్ ఆదేశాలతో నిలిపివేసిన షాపింగ్ కాంప్లెక్స్ పనులను టీడీపీ నాయకుల అండదండలతో మళ్లీ ప్రారంభించారు. 8లో



ఆదిమజాతుల మధ్య పోరే కంగువా

ఆదిమజాతుల మధ్య జరిగిన పోరును కథగా దర్శకుడు ఎంతో శ్రమించి కంగువాను చిత్రీకరించారని హీరో సూర్య తెలిపారు. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. 8లో

న్యూస్‌రీల్

'కాఫీ' ధరలపై విస్తృత ప్రచారం



పాతరుపుట్టులో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న, జీసీసీ సేల్స్ ఉమెన్ శ్రీదేవి

సాక్షి,పాడేరు: కాఫీ దిగుబడుల సీజన్ దగ్గర పడుతుండడంతో పాడేరు,చింతపల్లి జీసీసీ డివిజన్ల పరిధిలో కాఫీ రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ.. జీసీసీ ప్రకటించిన మద్దతు ధరలపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన మేరకు పార్చ్‌మెంట్ గింజలను కిలో రూ.285, అరబికా చెర్రీని కిలో రూ.150, రోబస్టా చెర్రీని కిలో రూ.80 ధరతో జీసీసీ కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. కాఫీ పండ్లను కిలో రూ.44ధరతో చింతపల్లి మ్యాక్స్ సంస్థ ద్వారా పాడేరు ఐటీడీఏ కొనుగోలు చేయనుంది. ఈ ధరలపై కాఫీ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జీసీసీకే కాఫీ గింజలను విక్రయించాలని, దళారుల మోసానికి గురికావద్దని కోరుతున్నారు. పాడేరు మండలం మారుమూల పాతరపుట్టు గ్రామంలో ఆదివారం జీసీసీ నిర్వహించిన అవగాహన సదస్సులో గుత్తులపుట్టు జీసీసీ డిపో సేల్స్ ఉమెన్ జి.శ్రీదేవి మాట్లాడుతూ కాఫీ సాగు చేసే రైతులంతా పంటను ఐటీడీఏ,జీసీసీలకే విక్రయించి, మంచి లాభాలు పొందాలన్నారు.దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

వైఎస్సార్ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి వసతులు

–ఏసీఏ అధ్యక్షుడు శివనాథ్ వెల్లడి



ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌ను సత్కరిస్తున్న, శివనాథ్

విశాఖ స్పోర్ట్స్ : ఆటగాళ్లకు మెరుగైన శిక్షణ అందించేందుకు ఇటీవల బీసీసీఐ ఆధ్వర్యంలో బెంగళూర్‌లోప్రారంభించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తరహా సెంటర్లను ఏసీఏ సౌత్,నార్త్, సెంట్రల్ జోన్‌లలో ఏర్పాటు చేస్తామని ఆంధ్ర క్రికెట్ సంఘం అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ వెల్లడించారు. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతులు కల్పిస్తామన్నారు. స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో యువతలో క్రికెట్ స్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. విశాఖ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఏసీఏకు నూతనంగా ఏర్పడిన అపెక్స్ కౌన్సిల్ ప్రతినిధులను సత్కరించారు. అనంతరం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల క్రికెట్ సంఘాల ప్రతినిధులతో అపెక్స్ కమిటీ భేటీ అయింది. క్రికెట్ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించింది.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

పాడేరు : కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన గిరిజన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకుంటామని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ స్పష్టం చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రవీణ్‌కుమార్ మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం చేసి, తల్లిదండ్రులకు అప్పగించారు. ముంచంగిపుట్టు మండలం పోలిపుట్టు గ్రామానికి అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించారు. కలెక్టర్, ఐటీడీఏ పీవోల ఆదేశాల మేరకు టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ రజనీ శనివారం రాత్రి కేజీహెచ్‌ను సందర్శించి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు.

- ఆందోళన కలిగిస్తున్న గిరిజన విద్యార్థుల మరణాలు
- ఐటీడీఏ లెక్క ప్రకారం ఆరుగురు మృతి
- వెలుగు చూడని మరణాలెన్నో
- సకాలంలో మెరుగైన వైద్యం అందకే ఈ దుస్థితి
- తల్లిదండ్రులకు తీరని గర్భశోకం

గాలిలో దీపంలా.. గిరి విద్యార్థుల ప్రాణాలు

జిల్లాలో విద్యార్థుల మరణాలు ఆగడం లేదు.. కడుపు కోతకు గురైన తల్లిదండ్రుల వేదన అధికారులకు పట్టడం లేదు.. దీంతో గిరిజన విద్యార్థుల మృతి సాధారణ విషయంగా మారింది.. ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు హెల్త్ వలంటీర్ల నియామకం విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల గిరిజన విద్యార్థుల మరణాలు పెరుగుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. వారి ఆరోగ్య రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యార్థి, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సాక్షి, పాడేరు: కొండకోనల్లో పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణతో కుటుంబాలను పోషించుకుంటూ పేదరికంలో జీవించే గిరిజనులు తమ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని..చదువుకునేందుకు ఆశ్రమ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి బాగా చూసుకోండి బాబూ అని నిర్వాహకులకు చెప్పి వస్తే..అధికారుల, సర్కార్ నిర్లక్ష్యం కారణంగా సకాలంలో వైద్యం అందక విద్యార్థులు మరణిస్తుండడంతో తల్లిదండ్రులకు కడుపు కోతే మిగులుతోంది. ఈ నాలుగునెలల్లో ఐటీడీఏ లెక్కలప్రకారం ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ఆరుగురు విద్యార్థులు మరణించారు. వెలుగులోకి రాని ఘటనలు అనేకం.

హెల్త్ వలంటీర్ల నియామకం ఎప్పుడు ?

జిల్లాలోని గిరిజన విద్యాలయాల్లో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులో లేవు. సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో అనారోగ్యానికి గురైన విద్యార్థులు మరణిస్తున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్‌వలంటీర్లను నియమిస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు అరకు సభలో ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా జిల్లాలోని 206 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్ల నియామకాల ఊసే ఎత్తడం లేదు. గిరిజన గురుకుల విద్యాలయాలు, కళాశాల హాస్టళ్లలో అనారోగ్యానికి గురైన విద్యార్థులకు సత్వర వైద్య సేవలందడం లేదు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో గిరిజన విద్యార్థులు మృతి చెందుతున్నా ఉన్నతాధికారులు రెండు మూడు రోజులు విచారణల పేరిట హడావుడి చేసి, తరువాత పట్టించుకోవడం లేదని గిరిజన సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో ఈ నాలుగు నెలల వ్యవధిలో ఆరు గురు గిరిజన విద్యార్థులు మాత్రమే అనారోగ్యంతో మృతిచెందారని ప్రభుత్వానికి పంపిన నివేదికలో ఐటీడీఏ పేర్కొంది. గిరిజన గురుకుల విద్యాలయాలు,కళాశాల హాస్టళ్లలో గిరిజన విద్యార్థుల మరణాలను మాత్రం బహిరంగ పరచడం లేదు.

అనారోగ్యానికి గురైతే ఇంటికే ..

గిరిజన సంక్షేమ ఆశ్రమాల్లో వైద్యసిబ్బంది అందుబాటులో లేక పోవడంతో అనారోగ్యానికి గురైన విద్యార్థులకు చికిత్స అందించేందుకు దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు తరలిస్తున్నారు. పరిస్థితి విషమిస్తే అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకెళుతున్నారు.



పెదబయలు గురుకుల కళాశాల విద్యార్థి పాంగి విజన్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి,ఇతర కుటుంబ సభ్యులు (ఫైల్)

అయితే విద్యార్థులు రెండుమూడు రోజులు మాత్రమే ప్రభుత్వ వైద్యశాలల్లో ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఆ తరువాత వివిధ కారణాలతో తల్లిదండ్రులు వారిని ఇళ్లకు తీసుకుపోతున్నారు. అటువంటి వారిపై పూర్తిస్థాయిలో ఆశ్రమ సిబ్బంది పర్యవేక్షణ లేకపోతోంది. దీంతో అనారోగ్య సమస్యలు ఎక్కువై మృత్యువాత పడుతున్నారు. ఇలా ఇళ్ల వద్ద, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మృతి చెందిన సంఘటనలు వెలుగులోకి రావడం లేదు.



జ్వరంతో మృతిచెందిన అప్పలకొండ(ఫైల్)

ఇటీవల మరణాల్లో కొన్ని..

- జీకే వీధి మండలం సప్పర్ల ఆశ్రమ పాఠశాలకు చెందిన జరతా శామ్యూల్ జులై 31న, ఇదే పాఠశాలకు చెందిన గొల్లురి మోహన్‌దాసు సెప్టెంబర్ 15న జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో మృతిచెందారు.
- పెదబయలు గురుకుల కళాశాల చెందిన ఇంటర్ విద్యార్థి పాంగి విజన్ ఆగస్టు 22న జ్వర, ఇతర అనారోగ్య సమస్యలతో మృతిచెందాడు.
- పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఫస్ట్ ఇయర్ విద్యార్థి సూర్యం జ్వరం,ఇతర అనారోగ్య సమస్యలతో ఆగస్టులో మృతి చెందాడు.
- పెదబయలు మండలం సీకరి ఆశ్రమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి వెచ్చంగి కాంతారావు జ్వరం,ఇతర అనారోగ్య సమస్యలతో వైద్యసేవలు పొందుతూ సెప్టెంబర్ 9న మృతిచెందాడు.
- జీకేవీధి మండలం ఆర్వీ నగర్‌కు చెందిన దారా మల్లేశ్వరి వెన్ను, బ్రెయిన్‌కు సంబంధించిన అనారోగ్య సమస్యలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సెప్టెంబర్ 16న మృతిచెందింది.
- అనంతగిరి మండలం టోకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన సూకురు అప్పలకొండ అనే విద్యార్థిని జ్వరం,ఇతర అనారోగ్య సమస్యలతో సెప్టెంబర్ 21న ఎస్.కోట ఆస్పత్రిలో మృతిచెందింది.
- పాడేరులోని గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న పూజారి లక్ష్మి సెప్టెంబర్ 23న అనారోగ్య సమస్యలతో వైద్యసేవలు పొందుతూ కేజీహెచ్‌లో మృతిచెందింది.
- అరకులోయ ఏపీ గురుకుల పాఠశాలలో టెన్త్ చదువుతున్న ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్టు గ్రామానికి చెందిన టెన్త్ విద్యార్థి బడ్నాయిక్ ప్రవీణ్ కుమార్ తీవ్ర అనారోగ్య సమస్యలతో ఈనెల 25న కేజీహెచ్‌లో మృతి చెందాడు.

ఆరోగ్య సిబ్బందిని నియమించాలి



జిల్లాలోని అన్ని ఐటీడీఏల పరిధిలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బందిని నియమించాలి. విద్యార్థులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలి.అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాలి.వారానికోసారి వైద్యశిబిరాలు నిర్వహించాలి.

– పి.బాలదేవ్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

పౌష్టికాహార లోపం ..



గిరిజన విద్యాలయాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం ఉన్నట్టు గుర్తించాం. ఐటీడీఏ చేపడుతున్న వైద్యశిబిరాలతో పాటు జిల్లా ఆస్పత్రికి వచ్చే గిరిజన విద్యార్థులను నేను స్వయంగా పరిశీలించాను.ఎదుగుదల లోపం కనిపించింది. వ్యక్తిగత పరిశుభ్రత,ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన పెరగాలి.అనారోగ్య సమస్యలు తలెత్తితే విద్యార్థులు సకాలంలో వైద్య సేవలు పొందాలనే అంశంపై ఉపాధ్యాయులు మరింత అవగాహన కల్పించాలి.

– డాక్టర్ విశ్వామిత్ర, సూపరింటెండెంట్, జిల్లా సర్వజన ఆస్పత్రి, పాడేరు

చేపట్టాల్సిన చర్యలివి

- విద్యాలయాల్లోని గిరిజన విద్యార్థులకు ప్రతి నెలా విధిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.
- అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక స్టూడెంట్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలి.
- స్కూల్ హెల్త్ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించాలి.
- ప్రతి ఆశ్రమ పాఠశాలలోనూ హెల్త్ వలంటీర్‌ను నియమించి, వారి ద్వారా విద్యార్థుల సంరక్షణకు చర్యలు చేపట్టాలి.
- మండల స్థాయిలో విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై మండల ప్రత్యేకాధికారి, ఏటీడబ్ల్యూవోల పర్యవేక్షణ చేయాలి.
- గిరి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు మన్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టాలి.
- విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ప్రతి రోజు క్లాస్ టీచర్ పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలి.

అధ్వానంగా గిరిజన విద్యాలయాలు



జిల్లా వ్యాప్తంగా గిరిజన విద్యాలయాలు అధ్వానంగా మారాయి.గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు,వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు,నాణ్యమైన విద్య,పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవ రూపంలో కానరావడం లేదు. పూర్తిస్థాయిలో మెనూ అమలుకావడం లేదు. దీంతో సరైన పౌష్టికాహారం లేక అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యమందక విద్యార్థులు మరణిస్తుండడం బాధాకరం

పాంగి జీవన్‌కృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

వైద్య,ఆరోగ్య సేవలు విస్తృతం



గిరిజన విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య ఆరోగ్య సేవలను విస్తృతం చేస్తున్నాం.సెలవులకు ఇళ్లకువెళ్లి మళ్లీ విద్యాలయాలకు వస్తున్న విద్యార్థులపై మరింత దృష్టి పెట్టి వైద్యపరీక్షలు జరుపుతున్నాం. మెరుగైన వైద్యసేవల కోసం కేజీహెచ్‌తో పాటు,ఇతర కార్పొరేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నాం.గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమించేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. విద్యార్థుల మరణాలు బాధాకరం.ప్రతి మరణంపైన సమగ్ర విచారణ జరుపుతున్నాం.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో,పాడేరు

ప్రవీణ్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలి



ముంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులు, వివిధ సంఘాల నేతలు, నాయకులు



అంబులెన్స్‌లో విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతదేహం



పాడేరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, గిరిజన సమాఖ్య నాయకులు

- అంబులెన్స్‌లో ఉన్న మృతదేహంతో ధర్నా
- రాత్రి వరకూ కొనసాగిన ఆందోళన

ముంచంగిపుట్టు:కేజీహెచ్‌లో మృతి చెందిన ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్టు గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి ప్రవీణ్‌కుమార్ కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని, ఈ మేరకు రాత పూర్వకంగా హామీ ఇవ్వాలని, విద్యార్థిని కొట్టిన అరకులోయ గురుకుల పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సాయంత్రం విద్యార్థి కుటుంబ సభ్యులు,వివిధ సంఘాల నేతలు,వైఎస్సార్‌సీపీ, సీపీఎం నేతలు మండల కేంద్రం ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్ జంక్షన్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. కేజీహెచ్‌లో శుక్రవారం ప్రవీణ్‌కుమార్ మృతిచెందగా, స్వగ్రామానికి తరలించేందుకు మృతదేహాన్ని ఆదివారం సాయంత్రంఅంబులెన్స్‌లో ముంచంగిపుట్టు తీసుకువచ్చారు. ఆగ్రామానికి వెళ్లకుండా అంబులెన్స్‌ను అడ్డుకుని కుటుంబ సభ్యులు, రాజకీయనాయులు, వివిధ సంఘాల నేతలు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వల్లే పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని, విద్యార్థుల మరణాలు ఎక్కువ అయ్యాయని,వైస్‌ప్రిన్సిపాల్‌కు ప్రభుత్వం, కలెక్టర్,ఐటీడీఏ పీవో కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. కేవలం సస్పెన్షన్‌తో సరిపెట్టారని,విద్యార్థి శరీరంపై గాయాలు ఉన్నా లేనిపోని వ్యాధుల పేరుతో వైస్ ప్రిన్సిపాల్‌ను రక్షించేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదని భీష్మించుకుని రోడ్డుపై కూర్చున్నారు.దీంతో ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు,పెదబయలుకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ జామ్ అయింది. రాత్రి 11 గంటల తరువాత కూడా ఆందోళన కొనసాగించారు. ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు ఎస్‌ఐ రవీంద్ర, ఎంపీడీవో శ్రీసాయి హర్ష తదితరులు ప్రయత్నించినా వారు పట్టు వీడలేదు. ఆదివారం ఉదయం గిరిజనసంఘం,సీపీఎం,మహిళ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఆందోళన చేశారు.

ఐటీడీఏ వద్ద ...

పాడేరు : వైస్ ప్రిన్సిపాల్ దాడిలో మృతి చెందిన అరకులోయ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని దొంగదారిలో స్వగ్రామానికి తరలించడం సిగ్గుచేటని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధకృష్ణ విమర్శించారు. మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సాయంత్రం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరకువేలి గిరిజన గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గిరిజన విద్యార్థిని తీవ్రంగా కొట్టి, గాయపర్చి మృతికి కారణమయ్యారని ఆరోపించారు. ఐటీడీఏ వద్ద తామంతా కలిసి విద్యార్థి మృతదేహంతో ఆందోళన చేస్తామని తెలుసుకున్న అధికారులు ప్రధాన రహదారి మీదుగా కాకుండా దొంగదారిలో స్వగ్రామానికి తరలించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేయాలని, మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, గిరిజన సమాఖ్య నాయకులు చిన్నా, రావణ్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఏవోబీలో 'రాబిన్ హుడ్'

- హీరో నితిన్,హీరోయిన్ శ్రీలీలపై పలు సన్నివేశాల చిత్రీకరణ
- జోలాపుట్టు,పాడువా, బలడ కేవ్స్ ప్రాంతాల్లో షూటింగ్
- తరలివచ్చిన సరిహద్దు గ్రామాల అభిమానులు





షూటింగ్‌లో పాల్గొనేందుకు వస్తున్న హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న రాబిన్‌హుడ్ సినిమా షూటింగ్ సందడి నెలకొంది. డైరెక్టర్ వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్, శ్రీలీల హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను జోలాపుట్టు నుంచి పాడువా వెళ్లే మార్గంతో పాటు బలడ కేవ్స్,పాడువా వద్ద మత్స్యగెడ్డ తదితర లొకేషన్లలో చిత్రీకరించారు. హీరో నితిన్,హీరోయిన్ శ్రీలీల డ్యూయెట్ సాంగ్, హీరోతో ప్రధాన తారాగణం మధ్య ఫైటింగ్ వంటి పలు సన్నివేశాలు తీశారు. నితిన్, శ్రీలీలను చూసేందుకు సరిహద్దు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు.కొంత మంది వారితో ఫొటోలు తీసుకున్నారు.ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతంతో పాటు అరకు ప్రాంతంలో మూడు రోజుల పాటు చిత్రీకరణ జరుగుతుందని చిత్ర బృందం తెలిపింది.

పర్యాటక ప్రాంతాల్లో టూరిస్టుల జోష్

మంచు సోయగాలను.. జలపాతాల హోయలను.. పచ్చని కొండలను.. బంగారు వన్నెలో తొలి కిరణాలను ప్రసరిస్తూ దివ్యమైన అనుభూతిని కలిగించిన సూర్యోదయాన్ని.. ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి పర్యాటకులు పరవశించిపోయారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. కుటుంబాలతో కలిసి టూరిస్టు స్పాట్‌లను సందర్శించి ఉత్సాహంగా గడిపారు.




కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న టూరిస్టులు


చింతపల్లి: లంబసింగి ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే పర్యాటకులు కుటుంబాలతో కలసి పాలసముద్రాన్ని తలపించే మంచు అందాలను తిలకించడానికి రావడంతో చెరువుల వేనం ప్రాంతంలో సందడి నెలకొంది.ఇటీవల వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఈ ప్రాంతంలో పొగ మంచు కురుస్తోంది. మంచు అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. టూరిస్టుల రాకతో చెరువుల వేనం వ్యూపాయింట్‌తో పాటు లంబసింగి జంక్షన్,తాజంగి జలాశయం ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

కొత్తపల్లి జలపాతం...

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించేందుకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. జలపాతంలో గంటల తరబడి జలకాలాడారు. ఇక్కడ వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఆనందంగా గడిపారు.




చెరువుల వేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు



మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్ వద్ద ...

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయకు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలు శనివారం రాత్రి నుంచే సందడిగా మారాయి. పద్మాపురం ఉద్యానవనం, గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియం, చాక్లెట్ హౌస్ తదితర ప్రాంతాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌కు శనివారం రాత్రే చేరుకుని, అక్కడ టెంట్లు ఏర్పాటు చేసుకుని గడిపారు. తెల్లవారు జామున సూర్యోదయం, పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలను తిలకించి పరవశించారు. గిరిజన సంప్రదాయ థింసా నృత్యం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. వ్యూపాయింట్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో చిరువ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.



చాపరాయి జలపాతం వద్ద సరదాగా..

చాపరాయిలో ...

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జైపూర్ జంక్షన్ మొదలు రైల్వే క్రాస్, కురిడి చాపరాయి వరకు వలిసే, బంతిపూల అందాలు పర్యాటకుల మదిని దోచుకున్నాయి. గిరిజనుల థింసా నృత్యం వారిని ఆకట్టుకుంది.

క్లుప్తంగా

బిర్సాముండా జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



బిర్సాముండా జయంతి ఉత్సవాల పోస్టర్స్‌ని ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ టౌన్: బిర్సాముండా జయంతి సందర్భంగా వచ్చే నెల 9, 10 తేదీల్లో అరకులోయలో జిల్లాస్థాయి సామాజిక శిక్షణ తరగతులు గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఈ సందర్భంగా బిర్సాముండా 150వ జయంతి మహోత్సవాల పోస్టర్‌లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ పోరాటయోధుడు బిర్సాముండా చరిత్ర కొసం ప్రతి ఒక్క గిరిజన యువత తెలుసుకొవాలని కోరారు. ఆయన జయంతి వచ్చే నెల 15న నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక టీటీడీ కల్యాణ మండపంలోని వచ్చే నెల 9, 10 తేదీల్లో సామాజిక శిక్షన తరగతులు నిర్వహిస్తున్నామని, గిరిజనులందరూ హాజరు కావాలని కోరారు. గిరిజన జేఏసీ నాయకులు రామన్నదొర తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా అల్లం సాగు



అల్లం సేకరిస్తున్న గిరి రైతులు

ముంచంగిపుట్టు: అల్లం సాగుపై గిరిజన రైతులు దృష్టి పెట్టారు. ధర బాగుండడంతో పాటు డిమాండ్ ఉండడంతో గిరిజన రైతులు అల్లం సాగును విస్తృతంగా పండిస్తున్నారు. గత ఏడాది అల్లం కిలో రూ.250ల వరకు ధర ఉండడంతో అల్లం రైతులకు లాభాలు అర్జించాయి. దీంతో ఈ ఏడాది గిరిజన రైతుల అల్లం సాగు విస్తీర్ణం పెంచారు. మండలంలోని 23 పంచాయతీల్లో రైతులు 241 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వారపు సంతల్లో అల్లంకు డిమాండ్ పెరిగింది. మైదాన ప్రాంతాన్ని నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో అల్లం సాగు విస్తీర్ణం మరింత పెంచుతామని చెబుతున్నారు.

మాస్టర్స్ స్విమ్మింగ్‌లో ఈశ్వర్‌కు స్వర్ణాలు

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర జిల్లాల మాస్టర్స్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో విశాఖకు చెందిన మాస్టర్ స్విమ్మర్ పి.ఈశ్వరరావు మూడు స్వర్ణాలు సాధించాడు. ఈ పోటీలు గుంటూరులోని ఎన్టీఆర్ మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం జరిగాయి. వంద మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 50 మీటర్ల బాక్ స్ట్రోక్, ఫ్రీస్టయిల్ అంశాల్లో విజేతగా నిలిచి పతకాలందుకున్నాడు.

ఇద్దరూ.. ఇద్దరే!



డి.హర్షిత



శివానీ లహరి

నేషనల్ యూత్ ఫెస్ట్‌కి ఎంపికైన శివానీ, హర్షిత

7 కేంద్ర పాలిత ప్రాంతాలు.. 28 రాష్ట్రాలు.. 418 బృందాలు.. 2,000 మందికిపైగా విద్యార్థులు.. క్వార్టర్ ఫైనల్.. సెమీఫైనల్ వడపోతలు.. చివరిగా మిగిలింది 124 మంది విద్యార్థులు.. దక్షిణాది రాష్ట్రాల **నుంచి** ఎంపికైంది నలుగురు.. అందులో ఏపీ నుంచి.. అదీ విశాఖ నుంచి ఫైనల్‌కు చేరింది ఇద్దరే.. వారే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన శివానీ లహరి, హర్షిత.

- ప్రజా అర్బన్ గవర్నెన్స్‌లో విశాఖకు చోటు దక్కేలా ప్రాజెక్ట్
- ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యాప్ తయారు చేసిన అమ్మాయిలు
- నో యువర్ వార్డ్ పేరుతో ఏఐ ఆధారిత గ్రీవెన్స్ యాప్
- నవంబర్ 16న లక్నోలో జరగనున్న ఫెస్ట్‌కు సిద్ధమవుతున్న శివానీ, హర్షిత

సాక్షి, విశాఖపట్నం: మార్పు మన నుంచే ప్రారంభం కావాలి. మరికొంతమందిలో ఆ మార్పు తీసుకొచ్చేందుకు విశ్వప్రయత్నం చేయాలి. తమ ప్రయత్నంతో కొంతమందిలోనైనా మార్పు వస్తే.. చాలనుకుంటారు నేటి యువతరం. ఆ కోవకు చెందిన వారే ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో బీఏఎల్ఎల్‌బీ థర్డ్ ఇయర్ చదువుతున్న ఎం.శివానీ లహరి, డి.హర్షిత. తమ ఆలోచనలను పంచుకునే వేదిక కోసం ఎదురు చూసిన వీరు ఇప్పుడు దొరికిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ఐక్యరాజ్యసమితి (యూఎన్-హాబిటేట్) సహకారంతో కేంద్ర ప్రభుత్వ అనుబంధంగా నడుస్తున్న ప్రజా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఏటా జాతీయ యువజనోత్సవాలు నిర్వహిస్తుంది. ఈ ఏడాది కూడా 'ప్రజాతంత్రం-2024' పేరుతో 'సెలబ్రేటింగ్ సిటీగవర్నెన్స్ ఇన్ ఇండియా' అనే థీమ్‌తో నేషనల్ యూత్‌ఫెస్ట్‌కు శ్రీకారం చుట్టింది.



విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ లా కాలేజ్ ప్రిన్సిపాల్ సీతామాణిక్యం, కళాశాల బృందం

28 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన వందల విద్యా సంస్థల నుంచి 2,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలోని సామాన్యుల సమస్యల పరిష్కారమే ప్రధాన అస్త్రంగా శివానీ, హర్షిత చేసిన ఉపన్యాసాలు ఫైనల్‌కు తీసుకెళ్లాయి.


తెలుగు రాష్ట్రాల నుంచి హర్షిత మాత్రమే..

ఈ పోటీలకు ఏయూ నుంచి 8 మందితో కూడిన బృందం దరఖాస్తు చేసుకుంది. ఆగస్ట్ 30 నుంచి సెప్టెంబర్ 1 వరకూ జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఇండివిడ్యువల్ పెర్ఫార్మెన్స్‌పై ఆన్‌లైన్‌లో డిబేట్ నిర్వహించారు. ఇందులో మేయర్‌తో కూడిన అర్బన్ బాడీ వ్యవస్థలో చర్చోపచర్చలు నిర్వహించారు. ఇందులో డి.హర్షితకు పాలసీ వ్యవహారాలపై మాట్లాడేందుకు ఎంపిక చేశారు. నగరంలో జరుగుతున్న వ్యవహారాలపై ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తూ హర్షిత చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. ఈ ప్రతిభతో 207 మందితో కలిసి సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్‌లో సామాన్య ప్రజల సమస్యల పరిష్కారంపై అధికార పక్షంలో ఉన్నప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనే అంశంపై చర్చ జరిగింది. ఈ చర్చలోనూ హర్షిత అదరగొట్టి.. ఫైనల్‌కు ఎంపికైంది. మొత్తం 18 మంది ఫైనల్‌కు ఎంపికవ్వగా.. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఎంపికవ్వగా తెలుగు రాష్ట్రాల నుంచి ఫైనల్‌కు చేరుకున్న ఏకైక విద్యార్థి హర్షిత మాత్రమే కావడం విశేషం.

నో యువర్ వార్డ్ యాప్‌తో...

వీరిద్దరూ తమ బృందంతో కలిసి నగర ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకమైన యాప్‌ను డిజైన్ చేశారు. దీనికి సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన ప్రజెంటేషనే వీరిద్దర్నీ ఫైనల్‌కు తీసుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సహకారంతో సాధారణ ప్రజలు కూడా తమ సమస్యలను అధికారులకు చెప్పుకోవడం, సమస్యలు విభజించి ఆయా అధికారులకు నేరుగా వెళ్లేలా 'నో యువర్ వార్డ్' పేరుతో రూపొందించిన యాప్ న్యాయనిర్ణేతలకు తెగ నచ్చేసింది. నవంబర్ 16 నుంచి 18 నుంచి లక్నోలో జరిగే ఫైనల్‌లో యాప్‌ని ప్రదర్శించాలని ప్రజా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు.





యాప్‌లో ప్రజా సమస్యల వినతుల గ్రాఫ్

చర్చలో.. సూపర్ శివానీ.!

ఎం.శివానీ లహరి ప్రతిభకు ప్రజాతంత్ర న్యాయ నిర్ణేతలు ఆశ్చర్యపోయారు. చిట్టీల తీసి టాపిక్ ఎంపిక చేసి.. దానిపై మాట్లాడాలని శివానీకి చెప్పారు. సామాన్య ప్రజల్ని పరిపాలనలో ఎలా భాగస్వామ్యం చేస్తారనే అంశంపై టాపిక్ వచ్చింది. ఇందులో ఎలాంటి స్థిరమైన విధానాలు అవలంబించాలనే విషయాన్ని ప్రజెంట్ చేసింది. బడ్జెట్‌లోనూ సామాన్యులకు ఎలాంటి అవకాశాలు కల్పించాలనే అంశంపై మాట్లాడుతూ అదరగొట్టింది. మొత్తం 150 మంది పాల్గొనగా.. శివానీతో సహా 80 మంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు. సెమీస్‌లో పట్టణ ప్రజలకు పథకాలు, సంక్షేమం, పరిపాలనని ప్రజలకు ఎలా చేరువ చేయాలనే అంశాలపై శివానీ లహరి చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. పాలసీ డాక్యుమెంట్ రూపొందించే విధానంపై శివానీ చేసిన ప్రజెంటేషన్ ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్‌కు మొత్తం 16 మంది చేరుకోగా ఏపీ, తెలంగాణ నుంచి ఇద్దరు సెలెక్ట్ అయ్యారు. ఇందులో ఏపీ నుంచి శివానీ లహరి ఎంపికవ్వడం గమనార్హం.

క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాం..

ఫైనల్‌కు ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. ఫైనల్‌లో యూఎల్‌బీకి సంబంధించిన సమగ్ర సమాచారం, ప్రజల నుంచి అభిప్రాయాలతో కూడిన వివరాలు సబ్‌మిట్ చేయాలి. ఇందు కోసం క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించాం. నవంబర్ 1 వరకూ జీవీఎంసీ పరిధిలో ఉన్న అన్ని వర్గాల వారి దగ్గర నుంచి సమాచారం సేకరిస్తాం. ప్రజాఫౌండేషన్ వద్ద ఏపీ నుంచి విజయవాడకు చెందిన సమాచారం మాత్రమే ఉంది. మరే ఇతర నగరానికి చెందిన ఇన్ఫో లేదు. అందుకే మేం చేసే క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన వివరాలతో ప్రత్యేకమైన హ్యాండ్‌బుక్ సిద్ధం చేసి అందించాలని నిర్ణయించాం. ఈ సమాచారంతో కూడిన వివరాలు ప్రజా ఫౌండేషన్ ఎన్‌జీవో, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ ఇండియా తమ వెబ్‌సైట్‌లో విశాఖకు చోటు కల్పించనున్నారు.

– శివానీ లహరి, నేషనల్ యూత్‌ఫెస్ట్ ఫైనలిస్ట్

యాప్‌తో ఎన్నో ఉపయోగాలున్నాయి

ఫైనల్స్‌కు ఎంపికవ్వడానికి ప్రధానమైంది మేం రూపొందించిన యాప్. క్వార్టర్స్, సెమీస్‌లో ఒక్కొక్కరికీ 5 నిమిషాల సమయం మాత్రమే ఇచ్చారు. యాప్ గురించి చెప్పిన తర్వాత మాకు అదనంగా మరో 3 నిమిషాలు కేటాయించారు. అప్పుడే మేం విజయం సాధించినంత ఆనందం వేసింది. ఈ యాప్ డిజైన్‌కు ఎంతో మంది సహకరించారు. ఏఐ సాంకేతికతతో బేసిక్ ఫోన్స్ ఉన్న వారు కూడా యాప్‌ని ఉపయోగించేలా కోడ్ రూపొందిస్తున్నాం. అంటే బేసిక్ ఫోన్ నుంచి టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమస్య చెప్పినప్పుడు అది యాప్‌లోకి జనరేట్ అయిపోతుంది. అప్పుడు సమస్య అధికారులకు చేరుకునేలా డిజైన్ చేశాం. సర్వే పూర్తయిన తర్వాత మేం నో యువర్ వార్డ్ యాప్ సిద్ధం చేస్తాం. ఫైనల్‌లో ఈ యాప్ మమ్మల్ని గెలిపిస్తుందని నమ్ముతున్నాం.

–డి.హర్షిత, నేషనల్ యూత్‌ఫెస్ట్ ఫైనలిస్ట్

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

పశుసంవర్ధకశాఖ స్థలంలో మళ్లీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

అరకులోయటౌన్: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో నిలిపివేసిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను కొంతమంది అధికారపార్టీ నాయకుల అండదండలతో మళ్లీ ప్రారంభించారు. అరకులోయ–పాడేరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న మండల కేంద్రం అరకులోయలోని పశుసంవర్ధకశాఖ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభించారు. దీనిపై గత ఏడాది అరకులోయ జెడ్పీటీసీ శెట్టి రోషిణి అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు పనులు నిలిపి వేయించారు. గత నెలలో మళ్లీ పనులు ప్రారంభించగా అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతోపాటు పశుసంవర్ధకశాఖ అధికారులు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిపివేశారు. అయితే కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తూ మళ్లీ నిర్మాణపనులు ప్రారంభించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అధికార పార్టీకి చెందిన కొంత మంది పెద్దల అండదండలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించినట్టు వివిధ సంఘాల ప్రతినిధులు అంటున్నారు. కలెక్టర్ తక్షణం స్పందించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిపివేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఏసీ బోగీల్లో చోరీలు.. ఒకరి అరెస్ట్



తుని రైల్వే పోలీసులు అరెస్ట్ చేసిన యలమంచిలికి చెందిన దుర్గాప్రసాద్

యలమంచిలి రూరల్: రైళ్లలో ఏసీ కోచ్‌ల్లో ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న 19 ఏళ్ల యువకుడ్ని తుని రైల్వే పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. యలమంచిలి పట్టణం ధర్మవరం వీధికి చెందిన నరాలశెట్టి జ్యోతీసు దుర్గాప్రసాద్ చిన్నతనం నుంచే నేరాల బాట పట్టాడు. దీంతో తల్లిదండ్రులు యువకుడ్ని గత కొద్ది రోజుల నుంచి ఇంటికి రానివ్వడంలేదు. నిందితుడు గోదావరి, విశాఖ, మచిలీపట్నం రైళ్లతో పాటు పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కొద్ది రోజులుగా చోరీలకు పాల్పడుతున్నాడు. ఏసీ బోగీల్లో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్న సమయంలో వారి విలువైన బంగారు ఆభరణాలు, హ్యాండ్ బ్యాగ్‌లు, మొబైల్ ఫోన్లను అపహరించుకుపోవడంలో ఆరితేరిపోయాడు. చోరీ చేసిన తర్వాత చాకచక్యంగా రైలు ఆగే తర్వాతి స్టేషన్‌లో దర్జాగా దిగి వెళ్లిపోతాడు. బాధితుల నుంచి ఫిర్యాదులు అందడంతో నిఘా ఉంచి యువకుడ్ని ఆదివారం అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 47 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.6వేలు నగదు స్వాధీనపర్చుకున్నారు.

నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



నదిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు: చేపల వేటకు వెళ్లి మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం సమీపంలోని నదిలో గల్లంతైన గోల్లోరి శుక్ర(53) మృతదేహం ఆదివారం మధ్యాహ్నం లభ్యమైంది. గురువారం గల్లంతైన అతడి ఆచూకీ కోసం మాచ్‌ఖండ్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేస్తున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. జోలాపుట్టు, డుడుమ జలాశయాల నుంచి నీటి విడుదలను సైతం నిలుపుదల చేసి, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం నుంచి నీరు రాకుండా చర్యలు తీసుకుని లమతపుట్టు తహసీల్దార్ దిబాకర్‌బాగ్, జయపురం అగ్నిమాపక అసిస్టెంట్ అధికారి సురేష్‌బారిక్‌ల ఆధ్వర్యంలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడంతో వారి శ్రమ ఫలించింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు శుక్ర మృతదేహాన్ని గుర్తించారు. మాచ్‌ఖండ్ పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

మేకల దొంగలకు దేహశుద్ధి



ఇవ్వంపల్లి గ్రామంలో దొంగలను స్తంభాలకు కట్టేసిన గ్రామస్తులు

మారేడుమిల్లి : మేకలు దొంగతనం చేసి పరారవుతున్న నలుగురు దొంగలను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ పరిధిలోని ఇవ్వంపల్లి గ్రామంలో ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామనికి చెందిన సోమిరెడ్డి అనే రైతు చెందిన మేకలను నలుగురు గుర్తు తెలియని యువకులు బైకులపై వచ్చి దొంగిలించి పట్టుకుని పోతుండగా గమనించిన స్థానికులు వారిని వెంబడించి పట్టుకుని స్తంభాలకు కట్టేని దేహశుద్ధి చేశారు. ఇదే గ్రామంలో గతంలో 20 మేకలు చోరీకి గురయ్యాయని గ్రామస్తులు తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

- 10వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సామగ్రి

ఎటపాక: మండలంలోని గుండువారిగూడెంలో సారా తయారీ కేంద్రాలపై ప్రత్యేక పోలీసు బలగాలు ఆదివారం దాడులు చేశారు. ఏఎస్పీ ఆదేశాలతో సీఐ కన్నపరాజు ఆధ్వర్యంలో జరిపిన ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే 10వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కన్నపరాజు హెచ్చరించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది(విశాఖ): సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

కొనసాగుతున్న కార్తీక దామోదర మాసోత్సవాలు : కార్తీక దామోదర మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వేకువ జామున 4.30 గంటల నుండి 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు, మంగళహారతి, నర్సింహ హారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీప సమర్పణ, గజేంద్ర స్తుతి, దామోదరాష్టకం, గోపి గీత, భగవద్గీత, శిక్షాష్టకం, యుగలాష్టకం పారాయణం నిర్వహించినట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ తెలిపారు.

రూ. 28 కోట్లతో కేజీహెచ్‌లో క్యాన్సర్ విభాగం ఆధునికీకరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో క్యాన్సర్ రోగులకు ఉచిత చికిత్స అందజేస్తున్నామని, ఇందులో భాగంగా క్యాన్సర్ విభాగాన్ని ఆధునికీకరించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. సాలిపేట కమ్యూనిటీ హాల్లో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్ అవగాహన శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేజీహెచ్‌లోని క్యాన్సర్ విభాగంలో రూ. 28 కోట్ల వ్యయంతో అధునాతన సాంకేతిక పరికరాలైన లినాక్ మిషన్ సమకూర్చుకోగలిగినట్లు చెప్పారు. ఐదు నుంచి పది లక్షల రూపాయలు ఖర్చు కాగల వైద్యాన్ని కేజీహెచ్‌లో ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. రొమ్ముల్లో గడ్డలు ఏర్పడిన సందర్భంలో నొప్పి ఉన్నా లేకపోయినా మెమోగ్రామ్ పరీక్ష చేయించుకుంటే వ్యాధి నిర్ధారణ అవుతుందని తెలిపారు. త్వరలో రొమ్ము క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని, దీన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. కేజీహెచ్ రేడియేషన్ అంకాలజీ విభాగం హెడ్ డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ క్యాన్సర్ నాలుగు స్టేజిల్లో ఉంటుందని తెలిపారు. మొదటి రెండు దశల్లో వ్యాధిని గుర్తిస్తే నయం అవుతుందన్నారు. చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి ఏటా అక్టోబర్‌లో రొమ్ము క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రొమ్ము క్యాన్సర్ లక్షణాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. విజయ, రుకీయభాను, శారద, అనసూయ పాల్గొన్నారు.

జేఏసీ పేరిట భూదందా


మాజీ సమితి ప్రెసిడెంట్ రామచంద్రరావు ధ్వజం



కూల్చివేసిన నిర్మాణ స్థలం వద్ద రామచంద్రరావు

అరకులోయ టౌన్ : అరకులోయలో జేఏసీ పేరిట కొంత మంది భూ దందా సాగిస్తున్నారని అరకులోయ మాజీ సమితి ప్రెసిడెంట్ సాగిరి రామచంద్రరావు ఆదివారం ఆరోపించారు. పద్మాపురం పంచాయతీ పరిధిలోని జ్యోతి మహల్ సినిమా థియేటర్ పక్కన ఉన్న సర్వే నంబర్ 86-1ఎలోని మూడు సెంట్లు తన పట్టా భూమిలో గృహ నిర్మాణం చేస్తుండగా శనివారం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో పద్మాపురం గ్రామానికి చెందిన గలుగు బోయిన గాశి తన అనుచరులతో వచ్చి నిర్మాణాన్ని కూలదోసారన్నారు. ఈ సంఘటనపై అరకులోయ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం కావడం, భూముల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో కొంత మంది భూబకాసురులు పథకం ప్రకారం వెనుక ఉండి ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, అమాయక గిరిజనుల భూములను అన్యాక్రాంతం చేసే వారిపై చర్య తీసుకోవాలని, గిరిజనుల భూములు కాపాడేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆదిమజాతుల మధ్య పోరే కంగువా



ఏయూక్యాంపస్: టికెట్ కొని కంగువా సినిమా చూసిన ప్రతీ ప్రేక్షకుడు సంతృప్తి చెందుతాడని హీరో సూర్య అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సినిమా మొత్తం సహజసిద్ధమైన వెలుతురులోనే చిత్రీకరణ జరిగిందన్నారు. వేలాది మంది కష్టం, ప్రేమ ఫలితమే కంగువా సినిమా అన్నారు. వందల సంవత్సరాల క్రితం ఐదు ఆదిమజాతి సమూహాల మధ్య జరిగిన ఆధిపత్య పోరును కథగా దర్శకుడు ఎంతో శ్రమించి చిత్రీకరించారన్నారు. ఈ చిత్రాన్ని 3డీ లో కూడా విడుదల చేస్తున్నామన్నారు. చిత్రంలో చాలా ఎమోషన్స్ ఉంటాయన్నారు. దేవీశ్రీ ప్రసాద్ మంచి సంగీతాన్ని అందించారన్నారు. ఈ చిత్రానికి అన్ని భాషల వారు కలిసి పనిచేసినట్లు తెలిపారు. బాబీడియోల్ పాత్ర, నటన ఈ చిత్రానికి మరింత బలాన్ని అందించిందన్నారు. దాదాపు రెండు గంటల సినిమా వందల ఏళ్ల క్రితంనాటిదని, కేవలం 20 నిమిషాల కథ ప్రస్తుత కాలానికి సంబంధించినదిగా ఉంటుందన్నారు. నవంబర్ 14న చిత్రం విడుదల చేస్తున్నామన్నారు. హీరో చేతిపై ఉండే గీతలు అతను సాధించిన విజయాలకు గుర్తులని వెల్లడించారు.

రూ.750 జీతంతో ఉద్యోగం చేశా..

తాను తొలిసారిగా రూ.750 జీతంతో ఉద్యోగంలో చేరానని, తన డెస్టినీ ఈ దిశగా నడిపించిందన్నారు. పెద్దకొడుకుగా బాధ్యత తీసుకుని ఉద్యోగం చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. తాను హీరో అవ్వాలని అనుకోలేదన్నారు. కాక కాక, జై భీమ్ వంటి చిత్రాలు సమాజంపై ఎంతో ప్రభావాన్ని చూపాయన్నారు. జై భీమ్ చిత్రం తరువాత తమిళనాడులో 3 లక్షల మందికి ఇంటి పట్టాలు లభించాయన్నారు. సమాజంపై ప్రభావం చూపే చిత్రాలు ఎప్పుడూ ప్రత్యేకమన్నారు. తన జీవిత భాగస్వామి జ్యోతికతో కలిసి ఒక చిత్రం చేయాలని అనుకుంటున్నాని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

కొత్త అనుభూతి పొందుతారు..

చిత్ర నిర్మాత జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ తెలుగు, తమిళ ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ తమ చిత్రం దాదాపు రూ.2 వేల కోట్లు వసూలు చేసేటంత ధైర్యాన్నిస్తోందన్నారు. ఇది మా అందరి డ్రీమ్ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందన్నారు. దర్శక దిగ్గజం రాజమౌళి గ్లోబల్ ఫిల్మ్ ఎలా తీయాలో చూపారని, పాన్ ఇండియా చిత్రాన్ని తాము నిర్మిస్తున్నామన్నారు. కొత్త అనుభూతిని, ప్రపంచాన్ని ప్రేక్షకులు ఈ చిత్రంలో చూస్తారన్నారు. కేజీఎఫ్ నటుడు అవినాష్ మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఈ చిత్రం తనదే అన్న ఫీలింగ్‌తో పనిచేశారన్నారు. ప్రతి క్షణం మారిపోయే వాతావరణం, కొడైకెనాల్‌లో చేసిన చిత్ర షెడ్యూల్ ఎంతో ప్రత్యేకమని, ఇవి గుర్తుండిపోతాయన్నారు.

విశాఖతో గొప్ప బంధం

విశాఖ నగరంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. 2015-16లో ఇక్కడే సింగం సినిమా చిత్రీకరణ చేశామన్నారు. ఇక్కడి ప్రజలు చూపించిన ప్రేమ మరువలేనిదన్నారు. ఎప్పుడూ నా సినిమా షూటింగ్‌కి రాని అమ్మ, నాన్న, నా పిల్లలు సైతం విశాఖ వచ్చారన్నారు. తన చిన్నతనంలో కమల్‌హాసన్‌ని ఇష్టపడే వాడినని, తరువాతి కాలంలో అందరు నటులనూ చూసి ప్రేరణ పొందుతున్నానన్నారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు శరవణన్ అని అది నేడు సూర్యగా మారిపోయిందని, ఇదంతా అందరి ప్రేమతోనే సాధ్యపడిందన్నారు.